# పాపం కథ

శ్రీ గాలి శ్రీరామశర్మ

శారద లావుగా, పొట్టిగా వుంటుంది. శరీరచ్ఛాయ గులాబి. ప్రక్కపాపిట; పొట్టిరవిక. తెల్లటి సన్నని పెద్దఅంచుచీర కడుతుంది. మొటిమలులేని, లేచెక్కిళ్లతో పాలుగారే గుండ్రని ముఖము. నీలపు రాళ్ల లోలకులు. మెడలో సన్నని బంగారుగొలుసు. చేతికి రెండుజతల బంగారుగాజులు. కాళ్లకు వెండి మిరియపుగొలుసూ ఉన్నాయి.

ఆవిడ ఎప్పుడో ఒకసారి గడప మెట్లమీద నుంచుంటుంది. ఒక్కపర్యాయం వీధిని చూచి తిరిగి యింటిలోకి వెళుతుంది. ఆవిడ, కనుపించినపుడు — మంచిఆరోగ్యంతో స్వస్థంగా వున్నట్టు గోచరిస్తుంది. సహజమయిన అందం ఆవిడలో తాండవిస్తోంటోంది. చెంపకు చేరడేసి కన్నులు సోయగాన్ని వెదజల్లుతున్నాయి.

ఆవిడ ప్రస్తుతం నాలుగుమాసములనుంచి ఆ పట్టణంలో వుంటున్నట్టు ఒక ఘనుడు రిమార్కు చేసుకున్నాడు అతని డయిరీలో. కాని, అతని కావిడను గురించిన యితరభోగట్టా యేమిన్నీ తెలియలేదు. అతడు సంపన్నగృహస్థుడు. యువకుడు. చిత్తచాంచల్యం అతణ్ణి వేధిస్తున్నది. అనేకసార్లు పనిగలవాడుగా తిరగడం ప్రారంభించాడు. ఎవరిగోడు వారిది. ఈ పిచ్చి ఎవరికర్థమవుతుంది? సావకాశంగా యితణ్ణి విమర్శించవలసిన అగత్య మేముంటుంది?

తిరిగి తిరిగి పాపం! విసుగెత్తింది. రాత్రిళ్లు సరిగా నిద్రపట్టదు. రోజు యేదో స్వప్నంరావడం, ఉలిక్కిపడిలేవడం. కన్నుతెరిచిచూస్తే తానూ, మామూలు వ్యవహారం. మనిషి మామూలుగానే తిండితింటున్నాడు. వస్త్రాలంకారం ఏపూట కాపూట నవీనం. నవనాగరకత అతనిలో వుట్టిపడుతున్నది. మొత్తంమీద అతడు వెనుకటి, కాంతిలో లేడు. శరీరం కొంచెం పుష్టి తగ్గుతున్నది. అతనికి ఆయాసంగా తోచినప్పుడు అరకప్పు కాఫీ అందిస్తున్నాడు శరీరానికి. సిగరెట్టుపెట్టెలఖర్చు అంతులేదు. ఇతరులతోవున్న స్నేహానికి కొంచెం కొంచెం స్వస్తిచెపుతున్నాడు. అతని ఉద్దేశ్యం—రహస్యంగా తానావిషయంలో సారాంశం తేల్చుకోవలెనని:

ఆవిడ బాగా చదవడం నేర్చిన యువతి. అందుచేత తెలుగుపుస్తకం యేదికనుపించినా, కళ్లకద్దుకుని ఆప్యాయంగా చదువుకుంటూ కాలక్షేపంచేస్తుంటుంది. తనతోడి యువతులతోనైనా సరే పనివున్నమటుకే మాట్లాడి వూరుకుంటుంది. పొరుగిళ్లకుతిరగడం ఆవిడకు గిట్టనిపని. భజనసమాజాలలో, హరికథలలో పాల్గొనడమంటే ఆవిడ కొకింత యీసడింపు.

ఇది ఆవిడ అత్తవారియిల్లు. భర్త ఆంగ్లభాషా పరిచయుడు. ఉద్యోగం యీరోజున యిచ్చేదాత వుంటే—కనీసం, వందరూకలయినా, యితరులను పీడించకుండా సంపాదించగల వ్యక్తి. వీ రిరువురకూ దాంపత్య సుఖమేర్పడి పదిమాసములయినది. అతడు రికామిగాయుండడం, అనారోగ్యహేతువనీ, పురుషలక్షణంగాదనీ మార్గాలు యోచిస్తున్నాడు. అతని పరిచయస్థుడు, గొప్పవ్యాపారం నిర్వహిస్తున్న రామన్న

మద్రాసులోవున్నాడు. అతని సలహాననుసరించి మద్రాసులో యీ నాలుగుమాసములనుంచీ యుండి వ్యాపార పరిస్థితులు అవగాహన చేసికొనుచున్నాడు. అతడక్కడ వంటరిగానే స్వల్పవేతనముతో జీవనం చేస్తున్నాడు. వీలుననుసరించి—అప్పుడప్పుడు వచ్చి తనయింట నాలుగైదురోజులుండి వెళ్లుచున్నాడు.

అతనికి తల్లి, ఒక తమ్ముడుమాత్రం వున్నారు. ఆతల్లి మహాతల్లి. కోడలిని బంగారంలా చూచుకుంటుంది. పనిముట్టుకుంటే కందిపోతుందేమో కోడలు అనుకుని కన్నతల్లికంటె మిన్నగా చూస్తున్నది. ఇతని తమ్ముడు పసికుంక. పదోయేడు ఫస్టుఫారం చదువుతున్నాడు. వారికి సాలీనా ఆదాయం అయిదువందలు వస్తవి.

భార్య యెలా వాడుతుందో చూడవలెనని — ఆభర్త ముప్పదిరూపాయలు తాను మద్రాసుప్రయాణం కడుతూ యిచ్చివెళ్లాడు. నాటినుంచి నేటివరకు చిన్న పుస్తకములో జమాఖర్చువ్రాసి వుంచుచున్నది. ఇటీవల భర్త వకపర్యాయం మద్రాసునుంచి కార్డు వ్రాశాడు. శారదవద్ద నేను వుంచిన మొత్తంలో ఎంత వుంటే అంత మరుటపాలో తనకు వెంటనే పంపవలసినదని. ఆవిడ, మరదిచేత మనియార్డరుఫారము తెప్పించి — యిరువది తొమ్మిది రూపాయలు పంపినది. భర్తకు డబ్బుచేరగనే "శారద! యింతజాగ్రతగ వాడు[illegible]దనుకోలేదు. ఆడుదానివద్ద డబ్బు నిలువదంటారు — ఆమాట యిక్కడ వృధాయైంది, అనుకున్నాడు.

ఆ ప్రేమపురుషుడు పరితపిస్తున్నాడు. ఛిదిపి దీపంపెట్టడానికి వీలయిన తనభార్యనుచూస్తే పెనుభూతాన్ని చూస్తున్నట్టు తోస్తున్నది. చిరాకు అసహ్యం క్రోధం అతనిలో తాండవిస్తున్నవి. అవకతవకలు ఒకరోజున ఏదోమాట సందర్భంలో భార్యని "నీవు నీ పుట్టింటికిపోతేగాని నేను బతికేట్టు లేదు" అన్నాడు. భార్య, బ్రతిమాలుకుంది ఏమిటిలా మారిపోతున్నారని. వెర్రిబాగులవాడిలా హాహాహా అని నవ్వి ఛస్! ఊరుకో అన్నాడు.

ఇలాంటిసంఘటనలు వారిరువుర నిత్యసంసార జీవనంలో రెండు, మూడు సార్లు తటస్థిస్తూవున్నవి. ఇతనిభార్య కదేమో! కారణం తోచుటలేదు. పైగా పిల్లలతల్లి. అంచేతనే అట్టే మనస్సునబెట్టుకుని కుమిలిపోకండా ఆ పిల్లలజంజాటంలో పడి వూరుకుంటున్నది.

విలాసపురుషుడు మనోద్రేకాన్ని పట్టలేకపోయినాడు. ఖులాసగా ముస్తాబయినాడు. శారద యింటివేపు నడుస్తూ సరాసరి ఆవీధినే పైకివెళ్లి ఒక అరగంట వ్యవధిలో తిరిగివస్తూ శారద యింటివేపు చూచినాడు—శారద పుస్తకముచూస్తూ తలెత్తిఅయినా చూడలేదు. శారద చదువుకున్న బాపతు అని యితనికి బాగుగా గోచరించినది. ఆదినమున నది మిట్టమధ్యాహ్నపువేళ. వెంటనే అతడు తనగదికిచేరి, తెల్లటి కాగితమునుతీసి యీ క్రిందిరీతిని వ్రాసినాడు.

"మీకు ఎటుల ప్రొద్దుపోవుచున్నది ?
విలాసముగ
చరింపదలచలేదా"

"విలాస"

అని వ్రాసినచీటిని "శారద" యింటిదాసిచేతికియిచ్చి, దానినెట్టులో యెడబర్చి ఒకరూపాయి దానిచేతిలో వాడుకోమని యిచ్చిపంపినాడు —

ఆదాసి జిత్తులమారి సమయముగుర్తించి యీ చీటిని శారదకు అందించినది. ముభావముగ వూరకున్నది.

"ఇదెక్కడిది? ఎవరు నీకిచ్చియుండిరి?"

"ఎవరూ యిచ్చినదిగాదు. యిచట దొరకినది."

"ఈ దొడ్డిలో అదెట్లు లభించినది. నిజము చెప్పు. ఫరవాలేదు. వ్రాసినదెవరు? సమాచారమేమి?"

"నాకేం తెలియదండీ అమ్మగారూ!"

"ఫరవాలేదన్నాను గదా! అంత భయమేల?"

"నా నోటికాడి జీవనం బోతుంది. ఏంచెప్పేది."

"చెప్పకపోతే వూరుకోను. మా అత్తగారు విన్నారంటే నీదుంపా; నాదుంపా తెగుతుంది. చెప్పు. మెల్లగా.

"ఆఁ యేమిలేదండి..." అని వెళ్లబెట్టింది ఆకాస్తా.

"ఓహో! ఇదా ఫరవాలేదు. నేనూ సమాధానం వ్రాసియిస్తాను. అతని కందించు."

అందులకు దాసీది చంకలు గొట్టినది.

"నా ప్రొద్దుబోవుటలు మీకు అనవసరములు. జవాబీయ నవసరములేదనుకుంటిని. గాని; సబబుగా జవాబు నిచ్చినంతమాత్రమున ప్రమాదములేదనుకున్నా.

నేనొక పురుషుని యధికారమునకు లోబడిన దాన్నను. నా సర్వస్వము నతడే. నా మనమతని యధీనమిదివరకే అయినది. అతడు నాకష్టసుఖముల చూచుచున్నాడు. నా ప్రేమ నిధాన మతడే. నాకు ప్రొద్దుబోవుటకు ననేకయిరువులు గలవు. కాని యీపద్ధతిమాత్రముకాదు. ఈపద్ధతి కేమాత్రము స్థానము లేదు. భ్రమవలదు. ప్రొద్దుబోవుట కనేకమార్గములని చెప్పితిని. గ్రంథపఠనమే సహకారి. నిజముగా మానసికానందము కలుగును. మనోనిర్మలత యేర్పడును. నా ప్రస్తుతపఠనీయగ్రంథము—"పాపము!" చలంగారి రచన. చదివినకొద్దీ రుచి. ఆనందము. యదార్థత. బోధపడుచున్నది. ఈ పాపంతోనే ప్రొద్దుబోవుచున్నది. "పాపం!" చదివేవారికి యితరవిలాసాలతో పనిలేదు. శ్రమపడి వ్రాతలు పెంచవద్దు. ఇదియే, ప్రథమతుది సమాధానం"

"—"

చదువురానిది, గనుక దాసీముండ వుబ్బిపోతూ చీటిపట్టుకుని వెళ్లి అతనికి యిచ్చినది.

"ఆహా! సమాధానమైనా వ్రాసింది. అంతే చాలు. కాని యింకో మధ్యకాలపు మనిషి అయితే దుమ్మెత్తిపోసును. రభసచేసివుండును. భర్తతో చెప్పి యెంతో గల్లంతుచేసివుండును — పాపం! ఎవరైతే నేమి? మహాతల్లి! ఆవిడ వ్రాసిన ప్రతీసంగతీ రసవంతమే. ఆచరణీయమే. అమృత తుల్యమే. యోగ్యురాలు, నాకు మంచి హితబోధ. ఆవిడ పాదాలు పట్టుకున్నా పాపంపోతుంది. కాని, అంతఅర్హత నాకు లేదు. అనుకుని దాసీదాన్ని యేదో యిచ్చిపంపివేశాడు బెట్టుసరిగా.

దాసీ దానిప్రశ్నకు యేదో జయం పొందినట్టు తలఊపాడు.

మరియొకమాసం గడిచింది. శారదభర్త పట్నం నుంచి వచ్చాడు. భర్తతో జరిగినసంగతి పూసగ్రుచ్చినట్లు చెప్పింది. అతనికళ్లు యెర్రబడ్డాయి. ఆఁ ఆఁ. అనబోతున్నాడు. అంతలో "తమాయించండి, ఉద్రేకంవద్దు. కామం గ్రుడ్డిది, యుక్తాయుక్తం తోచనివ్వదు. ఏదో పొరపడ్డాడు. నా తమ్ములలో ఒకడనుకున్నాను. నేనూ కోపగించుకోలేదు. కోపంవుంటే జవాబేమీయను. పాపం! పనిచేసేదాసీముండలకు కడుపునిండక యేపనియైనా చేస్తారు. దాన్నీ నేనేమీ అనలేదు. పైగాను సాదరుకర్చులు తగ్గించి యింకో అర్థరూపాయి నెలజీతం పెంచియిస్తున్నాను. ఇలాంటి పనులుచేయవద్దని డబాయించాను. పాపం గ్రుడ్లనీరు గ్రుడ్లకుక్కుకుంది. పిచ్చిముండ అంతటితో సంభాషణచాలించి మరోవిషయంలో మాటలు సాగాయి.

ఆవిలాస పురుషుడు కొన్నాళ్లకు విచారించుకోగా వారూ వీరూ బంధుశ్రేణిలో వారయినారు. ఓరోజు శారదయింటిలో విందుకురావడం అతనికి తటస్థించిందిగాని అతని మనస్సు చివుక్కుమన్నది. ఏవో సంబంధవరసలు తిరగవేస్తుండగా—శారద—విలాసపురుషునికి—వ్రేలువిడిచిన మేనత్తకూతురయింది.

"శారదా! ఇప్పటికీ పాపం! తోనే ప్రొద్దుగడుస్తున్నదా? అన్నాడు నవ్వుతూ.

"గడవకేం చేస్తుంది బావా!" అన్నది తలుపు దగ్గర నిలుచుంటూ.....

ఆ పాపం కథ యిరువురికీ స్ఫురించి ఒకరినొకరు చూసుకున్నారు అదోరకంగా—అరరే! ఎంత పొరబాటురా అని.........